

సత్యసాయి జిల్లా ఏర్పాటు ఓ వరం

ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



పుట్టపర్తి అర్బన్ : జిల్లాల పునర్విభజన సందర్భంగా పుట్టపర్తి కేంద్రంగా సత్య సాయి జిల్లాను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేయడం ఈ ప్రాంత ప్రజలకు ఓ వరం లాంటిదని పుట్టపర్తి శాసనసభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తిలో మంగళవారం నిర్వహించిన రైతుభరోసా పంపిణీ కార్యక్రమం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గతంలో కరువు కోరల్లో చిక్కుకుని అలమటించిన ఈ ప్రాంత ప్రజలకు గత ప్రభుత్వాలు ఏమీ చేయలేక పోయాయని తెలిపారు. వైఎస్.జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏనాడూ కరువు రాలేదన్నారు. రైతులను ఆదుకునేందుకు అన్ని విధాలా ముఖ్యమంత్రి సాయం అందిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం రైతులకు ఇస్తున్న రైతు భరోసా నిధులు పంట పెట్టుబడికి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఏటా కరువు కమ్మేసిందన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న పల్లె రఘునాథ్ రెడ్డి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులు నింపడానికి ప్రత్యేక జీవో జగన్ ఇచ్చారన్నారు. బెంగళూరు నుంచి విజయవాడకు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రహదారులు నాలుగు లైన్ల రహదారుల పనులు జరుగుతున్నాయన్నారు. పుట్టపర్తి కేంద్రంగా నూతన జిల్లా ఏర్పడడంతో ఇక్కడ స్థానికులకు ఉపాధి లభిస్తోందన్నారు. నియోజకవర్గంలో 31 రహదారుల మరమ్మతుల కోసం నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి రూ.35 కోట్లను రహదారుల మరమ్మతులకు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

కరువుపై కనిపించని స్పందన



పుట్టపర్తిలో బహిరంగ సభకు హాజరైన రైతులు, ప్రజలు, బహిరంగ సభలోప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

◆ మిగిలిపోయిన కరువు మండలాలు ఇక అంతేనా ?
◆ నిరాశపరచిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి స్పందిస్తారని ఉమ్మడి అనంతపరం జిల్లా వాసులు ఆశించారు. ఆయన ప్రసంగంలో ఎక్కడా అటువంటి స్పందనేది కనిపించలేదు. నాలుగేళ్లు కరువు లేదు.. ఈసారి కొన్ని మండలాల్లోనే ఉందంటూ దాటవేశారు. పుట్టపర్తి జిల్లాలో 11 మండలాలు కరువు మండలాల జాబితాలో లేవని,డ వీటిని కరువు మండలాలుగా ప్రకటించాలని ఒకవైపు ఆందోళనలు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ దీనిపై ఎటువంటి ప్రకటనా ముఖ్యమంత్రి నుంచి రాలేదు. రైతు భరోసా రెండో విడత పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పుట్టపర్తికి మంగళవారం విచ్చేశారు. విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయానికి వచ్చారు. అక్కడ అనంతపురం, సత్యసాయి జిల్లా నేతలు ఆయనకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించాక కార్యక్రమాన్ని ప్రారంభించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బటన్ నొక్కి రైతు భరోసా పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తమ హయాంలో రైతుల కోసం చేసిన కార్యక్రమాలను వివరించారు. నాలుగున్నరేళ్ల కాలంలో రూ.1.75 లక్షల కోట్లు రైతులకు ఖర్చు పెట్టామని వివరించారు. అదే తెలుగుదేశం హయాంలో రైతులను పట్టించుకోలేదని విమర్శలు చేశారు. ఆద్యంతం ఆయన ప్రసంగం మొత్తం రెండు ప్రభుత్వాల పాలనను బేరీజు వేస్తూ వివరించే ప్రయత్నం చేశారు. అయితే ఉమ్మడి జిల్లాలో కరువు పరిస్థితుల గురించిగానీ, ఇక్కడి అభివృద్ధి అంశాలను గురించి ప్రస్తావించలేదు. సాగు,తాగునీటి కష్టాలు కూడా త్వరలో రాబోతున్న తరుణంలో ఈ అంశాలపై ముఖ్యమంత్రి ఏమైనా హామీలిస్తారని రెండు జిల్లాల వాసులు ఎదురు చూశారు. కాని అటువంటి ప్రకటనేది చేయలేదు. పుట్టపర్తి నియోజకవర్గం పరిధిలో 31 రహదారుల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేస్తామన్న హామీ ఒక్కటే ఆయన ఇచ్చారు. ఎన్నికల సమయంలో జిల్లాకు ఏమైనా వరాలిస్తారని భావించినప్పటికీ అటువంటి అంశాలేవి ప్రసంగంలో ప్రస్తావనకు రాలేదు. ఇది అనంతపురం, సత్యసాయి జిల్లావాసులు నిరాశ పరిచింది. అదే విధంగా సత్యసాయి జిల్లాను తిరిగి అనంతపురంలో వీలినం చేస్తారన్న ప్రచారం సాగుతోంది. ఈ అంశంపైనా ఆయన ఎటువంటి స్పష్టతనూ ఇవ్వలేదు.

ప్రొటోకాల్‌పై వివాదం

ముఖ్యమంత్రి సభా వేదికపై ప్రొటోకాల్ అంశాలపై చిన్నపాటి వివాదం చోటు చేసుకుంది. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి వేదికపైకి ఎక్కేసరికి ఆయనకు కేటాయించిన సీటు ఏదీ లేకపోవడంతో అక్కడున్న జిల్లా వ్యవసాయాధికారిని ప్రొటోకాల్ పాటించరా.? అని అడగడంతో ఆయన పరుగునవెళ్లి కుర్చీ తీసుకొచ్చి ఆయనే వేశారు. అనంతపురం ఎంపీ విషయంలోనూ అదే రకంగా జరిగింది.

ముఖ్యమంత్రికి జర్నలిస్టుల సన్మానం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి జర్నలిస్టులు జ్ఞాపికను అందజేయడంతో పాటు శాలువా కప్పి సన్మానించారు. జర్నలిస్టులకు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలివ్వాలని క్యాబినెట్‌లో ఇటీవల నిర్ణయించారు. ఈ నేపథ్యంలో పుట్టపర్తికి మంగళవారం నాడు ఆయన విచ్చేసిన సందర్భంగా జర్నలిస్టులు కలసి ఆయన్ను సన్మానించారు. ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రామచంద్రారెడ్డి, శివారెడ్డి, పి.శ్రీనివాసులు, నరేష్, అనిల్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు, నాయకుల కోసం సుదీర్ఘ సమయం కేటాయింపు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ పర్యటనలో జిల్లా నేతలకు సుదీర్ఘ సమయమే కేటాయించారు. సాధారణంగా జగన్మోహన్‌రెడ్డి ముఖ్య నేతలతో కలసి వెళ్లిపోవడం జరుగుతూ ఉంటుంది. త్వరలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈసారి సమయం ముగిసినా ముఖ్య నాయకులతోపాటు, ద్వితీయ శ్రేణి నాయకుల వరకు అందరికీ సమయమిచ్చి మాట్లాడారు. దీంతో ఆయన తిరుగు ప్రయాణం నిర్ణీత సమయం కంటే ఆలస్యంగానే సాగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి పుట్టపర్తి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుమ్మనూరు జయరాం, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీలు గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శంకర్‌నారాయణ, సిద్ధారెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తిప్పేస్వామి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాది రైతు ప్రభుత్వం : వైఎస్.జగన్మోహన్‌రెడ్డి



ముఖ్యమంత్రికి నాగలి అందిస్తున్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు

పుట్టపర్తి అర్బన్ : రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన రైతు ప్రభుత్వం తమదని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. రైతు భరోసా సాయం పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఆయన బహిరంగ సభలో రైతులు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు అండగా నిలుస్తోందని చెప్పారు. రైతన్నకు మంచి జరగాలి.. పేద వాడికి మేలు జరగాలి.. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలు అభివృద్ధి చెందాలనే ఆలోచనతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. విత్తనం నుంచి పంట అమ్మకం వరకు ప్రతి రైతన్నను చెయ్యి పట్టుకుని నడిపించేందుకు ప్రభుత్వం ద్వారా అన్ని రకాలా సాయం అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులోనూ ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. చంద్రబాబు నాడు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండి రైతులకు ఎలాంటి సాయం అందించలేదన్నారు. టిడిపి స్కీమ్‌ల ప్రభుత్వం కాదని.. స్కాంల ప్రభుత్వం అన్నారు. చంద్రబాబు పేరు చెబితే స్కామ్‌లే గుర్తుకు వస్తాయన్నారు. చంద్రబాబుకు అధికారం ఎందుకు కావాలన్నది ప్రజలు ఆలోచన చేయాలని తెలిపారు.



ఓబుళదేవరచెరువులో నేలకొరిగిన వరిపంట



రొద్దంలో నీటమునిగిన వరిపంటను చూపుతున్న రైతు

గాలివానకు నేలకొరిగిన వరి

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

సోమవారం రాత్రి కురిసిన గాలివానకు మండలంలో పలుచోట్ల వరి పంట నేలకొరిగింది. మండలంలోని వెంకటాపురం, నారప్ప గారి పల్లి తదితర గ్రామాలకు చెందిన వరిపంట నేలకొరిగింది. దీంతో రూ 7లక్షలు నష్టం వాటిలిలందని ఆయా గ్రామాలకు చెందిన రైతులు వాపోయారు. నారప్ప గారి పల్లి చెందిన రాజారెడ్డి, గంగప్ప, వెంకట, మల్‌రెడ్డి తోపాటు వెంకటాపురం చెందిన రెడ్డప్ప నాయుడు, నాగమునినాయుడు, మునీంద్ర, శ్రీరామ నాయుడు కు చెందిన 10 కకరాల్లో వరి పంట నేలకొరిగింది. దీంతో తమకు రూ. 7 లక్షలు నష్టం వాటిల్లని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రొద్దం : మండలంలోని కురిసిన భారీ వర్షానికి కలిపి, శేషాపురం, బూదిపల్లి తదితర గ్రామాల్లో అపార పంటనష్టం జరిగింది. వరి పంటలు పూర్తిగా నేలకు ఒరిగిపోయాయని రైతులు వాపోయారు. కలిపి, శేషాపురం, బూదిపల్లి గ్రామాలలోని దాదాపు 500 ఎకరాల మేర వరి పంట నేలకొరిగింది. మండల వ్యాప్తంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం వరి పంటలు ఎంతో ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందపడ్డారు. అయితే వర్షానికి వరి పంటకు నష్టం వాటిల్లడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ఎంపీపీ చంద్రశేఖర్ నష్టపోయిన పంటలను మంగళవారం పరిశీలించారు. ఉన్నతాధికారులు సమస్యను వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి న్యాయం చేయాలని కోరారు.

రాష్ట్రంలో అరాచక పాలన : టిడిపి

ప్రజాశక్తి - బుక్కపట్నం

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని చంద్రబాబు నాయుడు తోనే తెలుగు ప్రజల భవిష్యత్తు, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని అన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పట్టించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి ఆదినారాయణ, మండల కన్వీనర్ మల్లిరెడ్డి, తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్య గౌడ్, నాయకులు జంగం వెంకటరాముడు, మాజీ ఎంపీపీ బాలు, సుబ్బారెడ్డి, సయ్యద్ బాషా, కేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమని ఆపార్టీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని సినిమా హాల్ ఎదురు వీధిలో టిడిపి నాయకులు బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు తుమ్మల మనోహర్, నారాయణస్వామి, గడ్డం మోహన, అశోక్ ,మంజు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ప్రదర్శిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుల నిర్బంధం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టపర్తి పర్యటన సందర్భంగా టిడిపి, జనసేన, నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధించారు. మంగళవారం పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్ లో టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, జనసేన నాయకులు అబ్దుల్లా, డాక్టర్ తిరుపతేంద్ర తదితరులను నిర్బంధించారు. అలాగే టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తో పాటు పలువురి నాయకులను గృహనిర్బంధం చేశారు. ముఖ్యమంత్రి తిరిగి వెళ్లే వరకు టిడిపి జనసేన నాయకులను వదలకుండా నిర్బంధించారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు వ్యక్తిగత పూచిపై పోలీసులు నాయకులను విడుదల చేశారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకుని వాటి పరిష్కారానికి బుధవారం సాయంత్రం 4 నుండి 5.00 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కదిరి ఆర్టీసీ డిపో మేనేజర్ మైనుద్దీన్ తెలిపారు. కదిరి డిపో పరిధిలోని ప్రయాణికులు తమ సమస్యలను 08494- 224315 నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని డిపో మేనేజరు కోరారు.

కురుబ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా నారాయణస్వామి

ప్రజాశక్తి - గోరంట్ల

శ్రీ సత్య సాయి జిల్లా కురుబ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా గుమ్మయపల్లి చెందిన నారాయణస్వామి, శివాలయం కాలనీకి చెందిన మల్లికార్జునను ఎంపిక చేయడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా నారాయణస్వామి, మల్లికార్జున మాట్లాడుతూ తమ ఎంపికకు సహకరించిన జిల్లా అధ్యక్షులు సామకోటి ఆదినారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని కురుబ సంఘం అభివృద్ధికి తమవంతు కృషిచేస్తామని అన్నారు.

ఉద్యానవన రైతులను ఆదుకోండి



పట్టుపరిశ్రమ శాఖ కమిషనర్‌తో అవుటాల రమణారెడ్డి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఉద్యానవన రైతులను ఆదుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి కోరారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా రాష్ట్ర ఉద్యానవన పట్టు పరిశ్రమల శాఖ కమిషనర్ శ్రీధర్ పుట్టపర్తికి వచ్చిన సందర్భంగా ఆయనను ఆవుటాల రమణారెడ్డిని కలసి జిల్లా పట్టు పరిశ్రమల శాఖలో రైతుల కష్టాలు వివరించారు. ప్రభుత్వం నుంచి రైతులకు రావలసిన ఇన్సెంటివ్ రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించాలని కోరారు. మామిడి తోటల ద్వారా జరుగుతున్న నష్టం గురించి వివరించి పంటల బీమా ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. అందుకు కమిషనర్ స్పందించి త్వరలోనే ఈ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఆవుటాల రమణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవనాధికారి చంద్రశేఖర్, వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి బాధితుల వినతి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు చేతుల మీదుగా వివిధ జబ్బులతో బాధపడుతున్న వారికి మందుల అవసరాలు కొనుగోలు నిమిత్తం రూ. 5. 50 లక్షల విలువైన చెక్కులను ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి మంగళవారం పుట్టపర్తి విమానాశ్రయం వద్ద ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వివిధ వర్గాల ప్రజల నుండి వినతులను స్వీకరిస్తూ వారి సమస్యలను విన్నారు. వారి సమస్యల పరిష్కారంపై తక్షణమే స్పందించారు.వెంటనే ప్రభుత్వం తరపున బాధితులకు సాయం చేయాలని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబుకు ఆదేశాలు జారీ చేశారు. సిఎం ఆదేశాల మేరకు బాధితులకు కలెక్టర్ చెక్కులు అందజేశారు.రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన ధర్మవరం నివాసి శ్రీనివాసులుకు రూ.లక్ష విలువైన చెక్కును అందజేశారు. బుద్ధిమాధ్యంతో బాధపడుతున్న నార్పలకు చెందిన పెద్దక్క కుమారుడు అశోక్ వైద్యఖర్చుల నిమిత్తం రూ. 50వేల చెక్కును అందజేశారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పెనుకొండ మండలం గుట్టూరుకు చెందిన రజనికి రూ. 50వేల విలువైన చెక్కును అందజేశారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న అనంతపురం జిల్లా ఎల్లనూరు మండలం ఎం వెంకట భాస్కర్ రెడ్డికి వైద్యఖర్చుల నిమిత్తం లక్ష రూపాయల విలువైన చెక్కును పంపిణీ చేశారు. కాన్సర్ వ్యాధితో బాధపడుతున్న రాప్తాడు మండలం ఎర్రగుంటకు చెందిన జి అశ్వినికి లక్ష రూపాయల విలువైన చెక్కును అందజేశారు. కిడ్నీతో బాధపడుతున్న వెస్ట్‌గోదావరి జిల్లా పాడిపేటకు చెందిన రాజేశ్వరికి రూ. 50వేల విలువైన చెక్కును అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లోనిస్పందన సమావేశ మందిరంలో ఈ కార్యక్రమంలో డిఆర్ఒకొండయ్య, జిల్లా వైద్యశాఖ అధికారి ఎస్‌వి. కృష్ణారెడ్డి, డిసిహెచ్ఒ తిప్పేనాయక్, కదిరి ఆర్డీవో వంశీకృష్ణ, పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

ప్రజాశక్తి మడకశిర

మండలంలోని ఆయా గ్రామాల్లో రహదారులు అధ్వానంగా తయారయ్యాయని, మురుగుకాలువలు లేక దుర్గంధం వెదజల్లుతోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండలం పరిధిలోని చత్రం పంచాయతీ సి రంగాపురం బిసి కాలనీలో 1995లో ఇందిరమ్మ ఇళ్లు ఏర్పాటు చేశారు. అయితే ఆ కాలనీ లో రోడ్లు లేక మురికి కాలువలో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా తమ పరిస్థితి మారలేదని వారు వాపోతున్నారు. వైసిపి ఎమ్మెల్యే తిప్పేస్వామి ఎన్నికల సమయంలో ఈ కాలనీని మోడరన్ కాలనీగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారని అయితే ఆయన ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదని విమర్శించారు. తమ సమస్యను సర్పంచి కాని, పంచాయతీ అధికారులకు కాని పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని రోడ్డు సౌకర్యం కల్పించి మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిన మురుగునీరు

అక్రమ అరెస్టులు.. ప్రజాస్వామ్యానికి సంకెళ్లు : టిడిపి

ప్రజాశక్తి మడకశిర

అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేస్తున్నారని టిడిపి నాయకులు విమర్శించారు. సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలోని కొడిగానిపల్లిలో ఎండిన వేరుశనగ పంటను టిడిపి నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ పర్యటన అనంతరం తిరిగి వెళ తున్న నాయకులను పోలీసులు అడ్డుకోవటంతో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 5గంటల సేపు రోడ్డుపై నిరసన తెలిపారు. అనంతరం పోలీసులు టిడిపి నాయకులను సోమవారం అర్ధరాత్రి సమయంలో అరెస్టు చేసి పెనుకొండలోని ఎన్.గ్రాండ్ హోటల్‌లో తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ మంత్రులు శ్రీనివాసులు , పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, మడకశిర నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామిని పోలీసులు నిర్బంధించారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు జిల్లా మైనారిటీ అధ్యక్షుడు భక్తర్, పట్టణ అధ్యక్షులు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రిటైర్డ్ ఇంజనీర్ మల్లికార్జున, మాజీ కౌన్సిలర్ నాగరాజు, నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ రవికుమార్, హనుమంతేగౌడ్, మారన్న తదితరులు పెనుకొండ గ్రాండ్ హోటల్‌కు వెళ్లి టిడిపి నాయకులను పరామర్శించారు.

పెనుకొండ : జిల్లాలో కాలు మోపే అర్హత సీఎం జగన్‌కు లేదని టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారధి అన్నారు. ముఖ్యమంత్రి జగన్ జిల్లా పర్యటన నేపథ్యంలో మడకశిరలో కరువుతో నష్టపోయిన పంటలను టీడీపీ రాష్ట్ర నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా నాయకులు పార్థసారథి, కాలవ శ్రీనివాసులు, పల్లె రఘునాథ్ రెడ్డి, గుండుమల తిప్పేస్వామిని పోలీసులు అరెస్ట్ చేసి పెనుకొండలోని హోటల్‌కు తరలించారు. మంగళవారం జగన్ పర్యటన ముగిసేంత వరకు నాయకులను అక్కడే నిర్బంధించారు. ఈ సందర్భంగా పార్థసారథి మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ పర్యటించిన ప్రతి చోట పరదాలు కట్టి పర్యటించడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలను ఎక్కడికక్కడ అడ్డుకుంటూ అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. పంటనష్టపోయిన రైతులను అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



పోలీసుల నిర్బంధంలో ఉన్న టిడిపి నాయకులు

టిటిడి పాలకమండలి ఉపాధ్యక్షులుగా బండ్లపల్లి మదన్ మోహన్ రెడ్డి

తలుపుల : తిరుమల,తిరుపతి దేవస్థానం పాలక మండలి ఉపాధ్యక్షులుగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ రాడ్స్ అధ్యక్షులు బండ్లపల్లి మదన్ మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.ఉత్తర భారతదేశం నందు ఢిల్లీలో తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి, ఈవో ధర్మారెడ్డి, ఎల్ఐసి చైర్‌పర్సన్ వేమిరెడ్డి, ప్రశాంత రెడ్డి సమక్షంలో పాలకమండలి ఉపాధ్యక్షులుగా బాధ్యతలు తీసుకోవడం సంతోషంగా ఉందని రాడ్స్ అధ్యక్షులు బి.మదన్ మోహన్ రెడ్డి తెలిపారు.

పోస్టర్లు విడుదల

కొత్తచెరువు : ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు నిర్వహించినున్న గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బారంసాబ్ ఆవిష్కరించారు. ఈ వారోత్సవాలను విద్యార్థులు, పాఠకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జయరాం, తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

గాండ్లపెంట : సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపిడిఒ రామానాయక్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండల పరిధిలోని కటారు పల్లి, గొడ్డివెలగల సచివాలయాలతో పాటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను సత్వర పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాషా, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ధర్మవరం టౌన్ : ఎస్సీ వర్గీకరణను పార్లమెంట్ లో ప్రవేశపెట్టి చట్ట బద్దత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు బీసీఆర్ దాసు డిమాండ్ చేశారు. వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ తలపెట్టిన విశ్వరూప మహాసభ విజయవంతం చేయాలని ఉమ్మడి అనంతజిల్లాలో చేపట్టిన ప్రచారరథయాత్ర మంగళవారం ధర్మవరానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనతోపాటు ఎమ్మార్పీఎస్ నాయకులు విశ్వరూప మహాసభ పోస్టర్లను విడుదలచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఎఫ్ రాష్ట్ర నాయకులు నాగరాజు, మండల కన్వీనర్ శేషు, సత్యసాయిజిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జి కోళ్ల కల్యాణ్, జిల్లా ఉపాధ్యక్షులు బూదప్ప తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలనకు విస్తృత అవగాహన

పెనుకొండ : మూఢ నమ్మకాల నిర్మూలనకు జెవివి ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు జనవిజ్ఞానవేదిక జిల్లా కార్యదర్శి హరి అన్నారు. 'నేషనల్ సైంటిఫిక్ టెంపర్ కాంపెయిన్' లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో జన విజ్ఞాన వేదిక పెనుకొండ జోన్ కమిటీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా కార్యదర్శి హరి మాట్లాడుతూ ప్రఖ్యాత శాస్త్రవేత్తలైన సివి. రామన్, మేడం క్యూరీ జయంతి సందర్భంగా ఈనెల 7వ తేదీ నుండి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు వివిధ రూపాలలో శాస్త్రీయ దృక్పథంతో కూడిన ఆలోచనలు విద్యార్థులలో, ప్రజలలో పెంపొందించడం కోసం పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ జయప్ప, అధ్యాపకులు ప్రతాప్ రెడ్డి, రంగ నాయకులు, చెన్నారెడ్డి, యశోద, రామన్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

కదిరి టౌన్ : పట్టణంలోని సైదాపురం మాజీ కౌన్సిలర్ పోలినేని శ్రీనివాసులు నాయుడు అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కందికుంట వెంకటప్రసాద్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, నాయకులు కొమ్మినేని గంగయ్య, ఇస్మాయిల్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కదిరి

O.S.NO:10/2023

Between:

గండారెడ్డి నిర్మలమ్మ W/o జి.రాజారెడ్డి D/o పొట్టా వెంకట సుబ్బారెడ్డి (Late) D.No:6-24 ఆకులవారిపల్లి గ్రామం, H/o చినగానిపల్లి అమడగూరు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

మరియు

పొట్టా రామకృష్ణమ్మ W/o పొట్టా నరసింహారెడ్డి మరియు 12 మంది ఇతరులు ...ప్రతివాదులు

1.పొట్టా పార్వతమ్మ W/o పొట్టా శివశంకరరెడ్డి లేట్ ఎ.కొత్తపల్లి గ్రామం, అమడగూరు మండలం (పోస్టు), శ్రీ సత్యసాయి జిల్లా.

2.పొట్టా హారిక D/o పొట్టా శివశంకరరెడ్డి లేట్ ఎ.కొత్తపల్లి గ్రామం, అమడగూరు మండలం (పోస్టు), శ్రీ సత్యసాయి జిల్లా.

3.పొట్టా పృథ్వీ గోకుల్ రెడ్డి S/o పొట్టా శివశంకరరెడ్డి లేట్ ఎ.కొత్తపల్లి గ్రామం, అమడగూరు మండలం (పోస్టు), శ్రీ సత్యసాయి జిల్లా.

4.పొట్టా సుగుణమ్మ D/o పొట్టా వెంకటసుబ్బారెడ్డి లేట్ W/o జనార్ధన్ రెడ్డి, చినగానిపల్లి , అమడగూరు మండలం (పోస్టు), శ్రీ సత్యసాయి జిల్లా.

5.మిఠాయి బషీర్ సాహెబ్ S/o భాషా సాహెబ్ D.No:1-A 1st Ward బస్టాండ్ దగ్గర అమడగూరు మండలం (పోస్టు), శ్రీ సత్యసాయి జిల్లా. ...ప్రతివాదులు 6,7,8,9,13

6,7,8,9,13వ ప్రతివాదులకు నోటీసు

ఇందుమూలంగా 6 నుండి 9 మరియు 13వ ప్రతివాదులకు తెలియజేయడము ఏమనగా పై కేసు మీ హాజరు నిమిత్తం 27/11/2023వ తేదిన పై కోర్టు వారు వాయిదా వేసినారు. కావున 27/11/2023న మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ ఉదయం 10:30 గంటలకు పైన తెలిపిన కోర్టులో హాజరై మీకు ఎటువంటి ఆక్షేపణలు, అభ్యంతరాలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేని పరోక్షంలో పై దావాలో మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:27/11/2023
స్థలం:కదిరి

తూముకుంట.బాబాజాన్, ఎమ్.ఎ., బి.ఎల్,
యాకాసి వీరాంజినేయులు, ఎమ్.ఎల్,
వాదితరుపు న్యాయవాదులు, కదిరి.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న బాబావలి

ప్రజాశక్తి హిందూపురం

విశాఖ ఉక్కు పరిరక్షణతో పాటు కడప ఉక్కు పరిశ్రమ సాధన కోసం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి పిలుపునిచ్చారు. బంద్ విజయవంతం కోరుతూ మంగళవారం పట్టణంలో ఉన్న బీసీ, ఎస్సీ ప్రభుత్వ బాలుర కళాశాల వసతి గృహాలలో ఎస్ఎఫ్ఐ హాస్టల్స్ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న బాబావలి మాట్లాడుతు కేంద్రం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ అడ్డంగా ఆదానికి, అంబానీలకు అప్పగించడానికి సిద్ధమైందన్నారు. అందులో భాగంగానే ఒక ప్రణాళిక బద్ధంగా ఆంధ్రుల ఆత్మగౌరవమైన విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడానికి గత ఏడాది నుంచి ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిరక్షణతో పాటు కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన విద్యా సంస్థల బంద్ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆయా కళాశాల వసతిగృహాల కమిటీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే కేసులు.. పోరాడితే అరెస్టులా..!

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ

ప్రజాశక్తి -పెనుకొండ

ప్రశ్నిస్తే కేసులు,పోరాడితే అరెస్టులా అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ నిలదీశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టపర్తి పర్యటన నేపథ్యంలో మంగళవారం పట్టణంలోని ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద టిడిపి నాయకులు సిఎం గో బ్యాక్.. సిఎం డౌన్ డౌన్ అంటూ నల్ల బెలూన్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అటు వైపుగా సీఎం పర్యటనకు బయలు దేరిన ఎమ్మెల్యే శంకర్ నారాయణ కాన్వాయ్‌ను టీడీపీ నాయకులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా అక్కడే వున్న పోలీసులు సవితమ్మ, టీడీపీ నాయకులను బలవంతంగా అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సవితమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాలయసీమ ద్రోహి అని విమర్శించారు. ఉత్తుత్తి బటన్లు నొక్కడానికి జగన్ రెడ్డి కోట్ల రూపాయలు ప్రజాధనం ఖర్చు చేసి పుట్టపర్తికి రావడం దుర్మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవనాయుడు, గుట్టూరు సూర్యనారాయణ, శ్రీరాములు యాదవ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పోలీసుస్టేషన్‌లో టిడిపి, సిపిఎం నాయకులు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి



విద్యార్థినుల నృత్యం

విద్యతోనే సమాజంలో గుర్తింపు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎల్పీసర్కిల్లోని శ్రీపద్మావతి డిగ్రీ కళాశాలలో ప్రెసర్స్ డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున, కళాశాల కరస్పాండెంట్ జగదీశ్, అధ్యాపకులు రమేశ్, శ్రీరాములు, రామాంజినేయులు, శ్రీనివాసులు, వాణి, కావ్యశ్రీ, నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కరువు సాయాన్ని ప్రస్తావించని జగన్ : పల్లె



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న 'పల్లె'

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టపర్తి పర్యటనలో కరువుసాయంపై కనీస ప్రస్తావన కూడా చేయలేదని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విమర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం జరిగిన బహిరంగ సభలో రైతులకు వరాలు గుప్పిస్తారని ఆశ పెట్టుకున్న రైతుల ఆశలు ఆవిరి అయ్యాయని అన్నారు. పుట్టపర్తి అభివృద్ధిపై మాట్లాడనే లేదన్నారు. పుట్టపర్తిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పరిశ్రమలు నెలకొల్పుతామని 193 చెరువులకు నీరు అందిస్తామని పుట్టపర్తి నియోజకవర్గ రైతులకు ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్లు అయినా ఇంతవరకు పుట్టపర్తిని అభివృద్ధి చేయలేదన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ గాని, నష్టపరిహారం కానీ ప్రకటించలేదన్నారు. జిల్లాలో కేవలం 21 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారని మరో 11 మండలాలను ఎందుకు కరువు మండలాలుగా ప్రకటించలేదని ప్రశ్నించారు. రైతు భరోసా క్రింద రాష్ట్ర ప్రభుత్వం వాటా తక్కువని కేంద్ర ప్రభుత్వం నుంచే ఎక్కువ నిధులు వస్తాయని అన్నారు. ఈ మాత్రం దానికి లక్షల రూపాయలు ఖర్చు పెట్టి ఇంత దూరం వచ్చే కన్నా విజయవాడలోనే రైతుల ఖాతాలకు జమ చేయవచ్చుకదా అని అన్నారు. ప్రజాధనం వృధా చేయడానికే ఇక్కడికి వచ్చినట్లుగా అనిపించిందన్నారు. పింఛన్లు పెరికేస్తామని, డ్వాక్రా మహిళలకు రుణాలు రాకుండా చేస్తామని బెదిరించి బహిరంగ సభకు తీసుకొచ్చారని ఆరోపించారు. ఉద్యానవన పంటలు, వేరుశనగ దెబ్బతిన్న రైతులను ఆదుకునే దిశగా ఈ ప్రభుత్వం ముందుకు రాలేదన్నారు. సత్యసాయి ట్రస్టు రూ. 47 కోట్లు పౌష్టిక ఆహారమైన రాగి జావాకు నిధులు ఇచ్చిందన్నారు. అలాగే రాష్ట్రంలో అనేక జిల్లాలకు సత్యసాయి తాగునీటి పథకం అమలు చేస్తున్నారన్నారు. విద్య వైద్య రంగాలలో ఎన్నో సేవలు చేస్తున్న ఘనత సత్యసాయి ట్రస్టుకే దక్కుతుందన్నారు. ఈనెల 23న జరిగే సత్యసాయి జయంతి వేడుకల గురించి ఒక్క మాట కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించకపోవడం శోచనీయమని అన్నారు. ఎంతసేపు టిడిపి పైన విమర్శలు గుప్పించడమే తప్ప చేసింది ఏమీ లేదన్నారు. ఇక గ్రీన్ ఫీల్డ్ 4 లైన్ల రహదారుల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంటే తాము ఏదో ఇచ్చినట్లుగా ముఖ్యమంత్రితో పాటు ఇక్కడ స్థానిక శాసన సభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సంకలు గుద్దుకుంటున్నారని ఎద్దేవా చేశారు. టిడిపి హయాంలో వేసిన రోడ్లకే మరమ్మతుల కోసం జగన్ రూ. 35 కోట్లు ప్రకటించారన్నారు. హంద్రీనీవా జలాలు తెచ్చిన ఘనత అప్పటి ముఖ్యమంత్రులు ఎన్‌టి రామారావు, చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం హంద్రీనీవా నీరు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తరలించుకొని పోతుంటే ఈ జిల్లా ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. తాను అబద్ధాలు చెబుతున్నాడని బహిరంగ సభలో చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 193 చెరువులకు నీరు అందిస్తామని పుట్టపర్తి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి చెప్పడమే తప్ప ఆయన చేసింది ఏమిటని ప్రశ్నించారు. చంద్రబాబును, తనను విమర్శించినంత మాత్రాన ప్రజలు నమ్మరని 2024 ఎన్నికలలో రాష్ట్రంలో టిడిపి జెండా ఎగరవేయడం ఖాయమని పల్లె ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ, సయ్యద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన

ప్రజాశక్తి రొద్దం

పెనుగొండ యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మండలంలోని తురకల పట్నం గ్రామంలో రైతులకు రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఎల్‌టి రుణాలు, భూమిపై రుణాలు, డ్వాక్రా మహిళలకు రుణాల గురించి వివరించారు. దాదాపు 20 లక్షల వరకు ఈ గ్రామానికి అందజేస్తామని, కావాల్సిన ప్రతి ఒక్కరూ పెనుగొండ యూనియన్ బ్యాంక్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది నాగేంద్ర, రవి రైతులు తదితరులు పాల్గొన్నారు.

హస్తకళలపై శిక్షణ

కదిరి టౌన్ : పట్టణంలోని శుభయశ్రీ చీరల ఉత్పత్తి కేంద్రం ఆధ్వర్యంలో హస్తకళలపై శిక్షణను ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని దత్త ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. కేంద్ర హస్తకళల అభివృద్ధి కమిషనర్ సహకారంతో ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకురాలు యశోద తెలిపారు. వ్యాపార మెలకువలు, మార్కెటింగ్, ఉత్పత్తి డిజైనింగ్, పబ్లిసిటీ ,ఈ మార్కెటింగ్ తదితర అంశాలపై మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మహిళల ఆర్థిక సామాజిక ప్రగతి లక్ష్యంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. హస్త కళల ద్వారా మహిళలు స్వశక్తితో ఆర్థికంగా రాణించాలని సూచించారు. గత నెల 16వ నుండి 21వ తేదీ వరకు మొదటి బ్యాచ్, ఈనెల 2 నుంచి 7వ తేదీ వరకు రెండో బ్యాచ్‌కు హస్త కళలపై శిక్షణను నిర్వహించినట్లు నిర్వాహకులు చెప్పారు. ఈకార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లు విఎస్ రెడ్డి, రాజేష్, రాజు, ఆనంద్ బాబు, ఆకాశ్, జస్వంత్ తో పాటు కంపెనీ సిబ్బంది అలీ, నిర్మల పలువురు మహిళలు పాల్గొన్నారు.

హిందూపురాన్ని జిల్లా కేంద్రం చేయండి

హిందూపురం : నాడు ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన హామీ మేరకు పార్లమెంట్ కేంద్రమైన హిందూపురాన్ని జిల్లా కేంద్రం చేయాలని బీఎస్పీ రాష్ట్ర నాయకులు శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఆబాద్ పేటలోని బిఎస్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూపురం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిన పట్టణమని వైశాల్యపరంగాను, వాణిజ్య పరంగా గాను జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని అన్నారు. ఈ నేపథ్యంలో హిందూపురాన్ని జిల్లా కేంద్రం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.ఈ సమావేశంలో నాయకులు పెన్నయ్య, ఎమ్మెల్ నారాయణ, చిరంజీవి, జంపుల నాగరాజస్వామి, మౌలాలి, చంద్రశేఖర్, గంగాధర్, నరసింహులు, రవికుమార్, అంజినప్ప, ఆది తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులు అక్రమం

ఓబుళదేవర చెరువు : కరువు సహాయక చర్యలు చేపట్టాలన్న డిమాండ్‌తో పుట్టపర్తిలో నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కార్యక్రమంలో నిరసన తెలియజేయడానికి వెళుతున్న సిపిఐ నాయకులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఒడిసి సిపిఐ మండల సిపిఐ కార్యదర్శి చలపతి నాయుడు, సహాయ కార్యదర్శి సుధాకర్, మహిళా సంఘం నాయకురాలు రత్నాబాయ్ తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.

మడకశిర రూరల్ : ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సిపిఐ తాలూకా ఇన్‌ఛార్జి పవిత్ర, జనసేన మండల కార్యదర్శి శివాజీని పోలీసులు అరెస్టు చేయడాన్ని నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా పవిత్ర మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలు వివరించడానికి కూడా హక్కు లేదా అని ప్రశ్నించారు.

మడకశిర : పుట్టపర్తి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసి తమ సమస్యలను వినిపించడానికి వెళుతుంటే తమను వెళ్లనీయకుండా నోటీసులు ఇవ్వడం ఏమాత్రం సమంజసం కాదని డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు హనుమంత అన్నారు. ఎస్సీ వర్గీకరణ పై తీర్మానం చేసి కేంద్రానికి నివేదిక పంపించాలనే విషయంపై సిఎంను కలవడానికి వెళుతున్న తమకు ఇలా నోటీసులు ఇవ్వడం అన్యాయమన్నారు.

ముదిగుబ్బ : ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అక్రమ అరెస్టులకు పాల్పడటం దుర్మార్గమని సిపిఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు విమర్శించారు. వర్షాభావ పరిస్థితి కారణంగా దెబ్బతిన్నకరువు రైతాంగానికి పంట నష్ట పరిహారం ప్రకటించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

'రైతులను ఆదుకోని వైసిపి'

ధర్మవరం టౌన్ : రాష్ట్రంలో రైతులను బిక్షగాళ్లను చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. సిఎం జగన్ సత్యసాయి జిల్లా పర్యటన వల్ల కోట్లాది రూపాయల ఖర్చు తప్ప రైతులకు ఒరిగిందేమిలేదన్నారు. తమ అధినేత పవన్ కల్యాణ్ పై విమర్శలు చేయడానికే అంతదూరం నుంచి కోట్లరూపాయలు ఖర్చుపెట్టుకుని జిల్లాకు వచ్చారన్నారు. టీడీపీ, జనసేన కలవడం వల్ల జగన్ ఓటమి భయంపట్టుకుందన్నారు.



మాట్లాడుతున్న 'చిలకం'

జాతరలో పాల్గొన్న ప్రముఖులు

కదిరి అర్బన్, కదిరి టౌన్ : మండలంలోని కారెడ్డిపల్లి తండాలో బుధవారం జరిగిన మారెమ్మ జాతరలో ప్రముఖులు పాల్గొన్నారు. కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ మారెమ్మ జాతరలో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం వస్తున్నారని.. సిపిఎం నేతల అరెస్టులు



పెనుకొండ పోలీసుస్టేషన్‌లో సిపిఎం నాయకులు



సోమందేపల్లి పోలీసుస్టేషన్‌లో సిపిఎం నాయకులు



ఓబుళదేవరచెరువు పోలీసుస్టేషన్‌లో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

సిపిఎం నాయకుల ఇళ్లలో శోధించి నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ అన్నారు. సిఎం జిల్లా పర్యటన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న సిపిఎం నాయకులను ముందస్తు పేరుతో అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. నాయకులు గంగాధర్, ప్రవీణ్, హనుమయ్య, రంగప్ప, నారాయణస్వామి, సుబ్బిరెడ్డి, బాబావలి తదతర నాయకులు ఇళ్లలో పోలీసులు శోధించి అరెస్టు చేయడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తూ పట్టణంలోని డిఎస్‌పి కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ జిల్లాలో మంత్రులు, ముఖ్యమంత్రుల పర్యటన సందర్భంగా సిపిఎం నాయకుల ఇళ్లను అర్ధరాత్రి పూట శోధించి కుటుంబ సభ్యులు లేరని చెప్పినా వినకుండా అవమానపరిచే పద్ధతిలో ఇళ్ల దగ్గరే కాపలా కాసి దొరికిన వారిని అరెస్టు చేయడాన్ని పోలీసుల దినచర్యగా పెట్టుకున్నారని విమర్శించారు. ఇది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక విధానాలకు సూచికగా ఉందని విమర్శించారు. నిత్యం ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే పాలకులు ప్రతిపక్షాల గొంతు నొక్కడం, నిరసనకారులను అక్రమంగా అరెస్టు చేయడం, విజ్ఞప్తుల స్వీకరించకపోవడం వారి నియంతృత్వానికి నిదర్శనమన్నారు. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే జిల్లాలో ఉన్న అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్దన్న మాట్లాడుతూ పేదల స్వాధీన అనుభవంలో ఉన్న ఇళ్ల స్థలాలు , సాగు భూములకు హక్కులు కల్పించాలన్నారు. భవిష్యత్తులో శాంతిభద్రతల పేరుతో ముందస్తు అరెస్టులు చేపడితే అవసరమైతే సంబంధిత అధికారులపై న్యాయస్థానాలను, మానవ హక్కుల కమిషన్లను సంప్రదిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం స్థానిక నాయకులు వెంకట్రాముడు, తిప్పన్న, ఉత్తప్ప, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో మండల కేంద్రంలోని సిపిఎం, ప్రజా సంఘాల నాయకులను స్థానిక పోలీసులు తెల్లవారుజామునే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు. సిపిఎం నాయకులు రాజగోపాల్, రంగప్ప, చాంద్ బాషా, హనుమయ్య, నారాయణస్వామి, గంగరాజు, శ్రీకాంత్, కొండా వెంకటేష్ తదితరును పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు.

లేపాక్షి : ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, నరసింహప్పను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి లేపాక్షి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసుల ద్వారా అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరని చిత్తశుద్ధి ఉంటే విద్యార్థుల సమస్యలు, రైతులు సమస్యలు వెంటనే పరిష్కరించాలని బాబావలి డిమాండ్ చేశారు.

చిలమత్తూరు : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పుట్టపర్తి పర్యటన నేపథ్యంలో సిపిఎం మండల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. నాయకులు లక్ష్మినారాయణను పోలీసులు తెల్లవారు జామున అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు. సిపిఎం నాయకులతో పాటు టీడీపి నాయకులను అరెస్టు చేశారు. పుట్టపర్తికి వచ్చిన సిఎం ప్రతిపక్షాలను చూసి వణికి పోతున్నారని అందుకే ముందస్తు అరెస్టులు చేస్తున్నారని టీడీపి నాయకులు అన్నారు.

కొత్తచెరువు : ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా టిడిపి, సిపిఎం, జనసేన పార్టీ నాయకులను ప్రభుత్వం ముందస్తు అరెస్టులు చేయించడం తగదని సిపిఎం నాయకులు గంగాధర్, టిడిపి నాయకులు బోయ రాజు, చంద్రమోహన్, వైవి మురళి, లోచర్ల పెద్దన్న, జనసేన మండల కన్వీనర్ శివప్రసాద్ అన్నారు. మంగళవారం తెల్లవారుజామున పోలీసులు నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి వారిని అరెస్టు చేసి స్టేషన్ కి తరలించారు, ముఖ్యమంత్రి పర్యటన పూర్తి అయ్యేంతవరకు వారిని స్టేషన్లోనే ఉంచారు.

నల్లచెరువు : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సత్యసాయి జిల్లా పర్యటన సందర్భంగా రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరాములు, సిఐటియు మండల అధ్యక్షుడు రామకృష్ణను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. జిల్లాలోని కరువు పరిస్థితులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళదామనుకుంటే ఇలా అరెస్టు చేయడం అన్యాయమని అన్నారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

హిందూపురం : ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఎస్ఎఫ్ఐ, సిఐటియు, సిపిఎం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి ఆయా పోలీసుస్టేషన్లకు తరలించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, సిఐటియు నాయకులు నరసింహప్పను లేపాక్షి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి మాట్లాడుతు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, విభజన చట్టంలోని అంశాలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపడితే ఆ ఆందోళనలను పోలీసులను అడ్డుపెట్టుకొని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరన్నారు. చిత్తశుద్ధి ఉంటే విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించడం చేతకాని ముఖ్యమంత్రి పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేయించారని విమర్శించారు.

కదిరి టౌన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టపర్తి పర్యటన నేపథ్యంలో ముందస్తుగా సిపిఎం నాయకులను అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బి రెడ్డి, సీపీఎం పట్టణ కార్యదర్శి జీఎల్. నరసింహులు విమర్శించారు. మంగళవారం ఉదయం నుంచే పోలీసులు వామ పక్షాలు నాయకుల ఇళ్లవద్దకు, కార్యాలయాల వద్దకు చేరుకొని నాయకులను పట్టణ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సిపిఎం నాయకులు ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటారన్న భయంతో అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోయి పెట్టిన పెట్టుబడులు రాక నష్టాల ఉబిలో చిక్కుకున్నారన్నారు. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకొనే ప్రభుత్వం శ్రీ సత్య సాయి జిల్లాలోని 32 మండలాలకు గాను కేవలం 21 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం అన్యాయమన్నారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులను అన్ని రకాలుగా ఆదుకోవాలని, బ్యాంకులలో ఉన్న రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని కోరారు. రబీ సీజన్లో అవసరమైన విత్తనాలను, ఎరువులను పూర్తిగా ఉచితంగా ఇవ్వాలన్నారు. గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేయాలని, గ్రామీణ రైతులు వలసలు వెళ్లకుండా ఉపాధి హామీ పనులను 300 రోజులకు పెంచాలని 600 రూపాయలు కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువ ద్వారా 32 మండలాలలోని అన్ని చెరువులకు నీటిని అందించాలని కోరారు. కేరళ ప్రభుత్వ తరహాలో రుణవిముక్తి చట్టాన్ని తీసుకొని రావాలని డిమాండ్ చేశారు.

ధర్మవరం టౌన్ : ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో ధర్మవరంలో పోలీసులు రైతుసంఘం, ఎమ్మార్పీఎస్, సీపీఐ, విద్యార్థిసంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టుచేశారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు జంగాలపల్లి పెద్దన్న, జేవీ రమణ, ముసుగుమధు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ తుంపర్తి పరమేశ్ మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఏ ముఖం పెట్టుకుని జిల్లా పర్యటన చేశారని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులతో భయపెట్టలేరన్నారు.